మండుతున్న ఎండలు


త్రోవగుంట అంబేద్కర్ జంక్షన్ వద్ద నిర్మానుష్యంగా ఉన్న చీరాల, ఒంగోలు సర్వీస్ రోడ్డు


సోడా బండ్ల వద్ద ద్విచక్ర వాహన చోదకులు


జోరుగా సాగుతున్న తాటి ముంజల వ్యాపారం


త్రోవగుంట కంపెనీల వద్ద బోసిపోయిన నేషనల్ హైవే

ఒంగోలు రూరల్: జిల్లాలో వాతావరణం మార్పుతో జనం బిత్తరపోతున్నారు. గత శని, ఆదివారం జిల్లా కేంద్రంలో.. రూరల్ మండలంలోను వర్షపు జల్లులు కురియగా సోమవారం భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే వాహన చోదకులు మధ్యాహ్నం వేసవి తాపాన్ని తట్టుకోలేక తాటి ముంజలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఫ్లై ఓవర్ కింద, చెట్ల క్రింద సేద తీర్చుకుంటున్నారు.




ఫ్లై ఓవర్ కింద సేద తీరుతున్న లారీ డ్రైవర్లు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలు

మద్దిపాడు: మండలంలోని కొష్టాలు మద్దిపాడు మధ్య యువతి ఒకరు మోటార్ సైకిల్‌పై నుంచి జారి పడి తీవ్రమైన గాయాల పాలైన ఘటన జాతీయరహదారిపై మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నంగి ఎస్‌సీ కాలనీకి చెందిన తేళ్ల మోషే భార్య అంజమ్మతో కలిసి ఒంగోలు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళుతుండగా కొష్టాల సెంటర్, మద్దిపాడు మధ్యలో వెనుక కూర్చున్న అంజమ్మ (45) మోటర్ సైకిల్ పై నుంచి జారి కింద పడిపోగా ఆమె తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు హైవే అంబులెన్స్ ద్వారా ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అంజమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ


పోలమ్మ కుటుంబానికి సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కొత్తపట్నం: పక్షవాతంతో బాధపడుతున్న కుటుంబాన్ని అల్లూరు మదర్ థెరీసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ వారు ఆదుకున్నారు. కొప్పోలు గ్రామానికి చెందిన పాలేటి వెంకయ్య భార్య పోలమ్మ చాలా రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతోంది. తినడానికి తిండి లేక, హాస్పిటల్‌లో చూపించుకోవడానికి స్థోమత లేక ఇంటికే పరిమితమయ్యారు. ఎవరైనా ఆర్థిక సహాయం చేస్తారని ఎదురు చూస్తుండగా మదర్ థెరీసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు దాసరి సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నెల రోజులు పాటు వాడుకునే నిత్యావసర సరుకులు తను సొంత నగదుతో ఇప్పించాడు. ఆర్గనైజింగ్ టీం సభ్యులు సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. డి.కేశవ, ఎం.సునీల్, బి.దానియల్, ఎం.రాజ్‌కుమార్, ఎం.ప్రసాద్, ఎం.బాబు, వినయ్, ఎం.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.201

ఒంగోలు రూరల్: రూరల్ లోని పొగాకు వేలం కేంద్రం–2 లో పొగాకు కిలో ధర రూ.201 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం వేలం కేంద్రానికి 1026 బేళ్ళు రాగా 985 పొగాకు బేళ్ళు వ్యాపారస్థులు కొనుగోళ్ళు చేయగా 7 బేళ్ళు నోబిడ్ అయ్యాయి. గరిష్ట ధర రూ.201, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.199.71 గా నమోదయినట్లు నిర్వహణాధికారి తెలిపారు.

రైలు కిందపడి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: రైల్వే గ్యాంగ్‌మెన్‌గా పనిచేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చీరాల రైల్వేలో గ్యాంగ్‌మన్‌గా పనిచేసే కరవది అంబేడ్కర్‌నగర్ ఎస్సీ కాలనీకి చెందిన దేవరపల్లి చంద్రయ్య (62) ఉదయం 8 గంటల ప్రాంతంలో కరవది రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఇటీవలే ఆయన వలంటరీ తీసుకొని కుమారుడికి ఉద్యోగం ఇప్పించుకున్నట్లు సమాచారం. రైల్వే ఎస్సై పి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ అసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తర్లుపాడు: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తర్లుపాడు మండల కేంద్రంలోని నాయుడుపల్లి కాలనీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఆటో బోల్తా పడటంతో చెన్నారెడ్డిపల్లికి చెందిన పి.పుల్లారెడ్డి కాలికి బలమైన గాయం కాగా తర్లుపాడుకు చెందిన ఆంజనేయులు, బాలనాగమ్మ, బీబీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను అంబులెన్సులో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. పుల్లారెడ్డికి మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు.

ఆస్తి వివాదంలో దాడి


గాయపడిన వెంకటర రత్నమ్మను అంబులెన్స్‌లో రిమ్స్ కు తరలిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: ఆస్తి మీద కన్నేసిన బంధువులే వారి పాలిట రాబందువులయ్యారు. అత్యంత విలువైన భూమిని తమకే విక్రయించాలంటూ దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచారు. గుంజి వెంకటేశ్వర్లు దంపతులు కూతురు, కుమారుడితో కలిసి గత కొంతకాలంగా పేర్నమిట్టలో నివాసం ఉంటున్నారు. కూతురు అనుషా పేర్నమిట్టలోని సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఇంటి స్థలం విషయంలో వెంకటేశ్వర్లు సోదరుల మధ్య కొంతకాలంగా వివాదం ఉంది. అయితే పోలీసులు ఇరువురి మధ్య రాజీ చేసి పంపించారు. ఈ క్రమంలో మంగవారం రాత్రి వెంకటేశ్వర్లు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈదాడిలో వెంకటేశ్వర్లు భార్య వెంకటరత్నమ్మకు గాయాలయ్యాయి. వెంటనే రిమ్స్‌కు తరలించారు.

ఉపాధి హామీతో భరోసా


పులికొండలో రోడ్డు పక్కన జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఉపాధి కూలీలు


ఆర్.ఎల్.పురంలో చెరువు లోపల పూడిక పనులు చేస్తున్న కూలీలు

- రూ.14.44 కోట్ల పనులు
- 3.84 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం
- సరాసరి కూలి రూ.272 కు తగ్గకుండా పనుల కల్పన

చీమకుర్తి: వేసవి కాలంలో పొలం పనులు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు ఉపాధి హామీ పొట్ట నింపుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చీమకుర్తి మండలంలోని 24 పంచాయతీల్లో రూ.14.44 కోట్లతో ఉపాధి పనులను కల్పించాలనే లక్ష్యంతో బడ్జెట్‌ను రూపొందించినట్లు ఏపీఓ రాఘవ తెలిపారు. దానిలో భాగంగా ఏప్రిల్ నుంచి మండలంలోని 24 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించి రోజుకు 5 వేల నుంచి 6 వేల మంది కూలీలకు పనులను కల్పిస్తున్నట్లు రాఘవ తెలిపారు. రోజుకు సరాసరి కూలి రూ.272 కు తగ్గకుండా పనులను చూపిస్తున్నారు. ఆ లెక్కన ఏడాది మొత్తం మీద 3.84 లక్షల పనిదినాలకు రూ.10.44 కోట్లను కేటాయించారు.

దానికి అదనంగా మెటీరియల్ కింద పనిదినాల బడ్జెట్‌లో 40 శాతం అంటే మరో రూ.41 కోట్లు కేటాయించారు. కూలీలకు వేతనం మరియు మెటీరియల్ కింద మొత్తం కలిపి రూ.14.44 కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరం కూలీలకు 3.84 లక్షల పనిదినాల ద్వారా ఉపాధి కల్పించనున్నారు. ఉపాధి పనులలో ప్రధానంగా చెరువులు, పంట కాలువల పూడికతీత పనులు, మేజర్ కెనాల్స్ పూడిక తీత, చెక్‌డ్యామ్‌ల ఆధునికీకరణ, రోడ్ల ఏర్పాటు వంటి పనులను చేపట్టనున్నారు. వేసవి కాలంలో ఎండలు మండుతున్న తరుణంలో పనిచేసే కూలీలకు అదనంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లను అందించటం, మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచటంతో పాటు మంచినీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఏపీఓ రాఘవ వెల్లడించారు. ఏడాది పొడవునా పేదలకు పనులను కల్పిస్తామని తెలిపారు. పొలం పనులు లేని కాలంలో పేదల కుటుంబాలను ఉపాధి హామీ పనులు ఆదుకుంటున్నాయని పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సమస్యను అజెండాలో పెట్టాలి

- మండల స్థాయి అధికారులతో అవగాహన సదుస్సు


సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఎంపీడీఓ సుజాత

కొత్తపట్నం: సమస్యలన్నీ సచివాలయాలకు వస్తున్నాయని ప్రతి సమస్య అజెండాగా పెట్టుకుని పరిష్కరిస్తే సచివాలయ సిబ్బందికి మంచి పేరు వస్తుందని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డిజిటల్ అసిస్టెంట్లు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, ఏవో, ఈవోఆర్డీలతో సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి 10–30 గంటల లోపు ఫేషియల్ అటెండెన్స్ వేసే విధంగా విధులకు హాజరై సాయంత్రం 5 గంటలకు కార్యాలయాల్లో విధులు నిర్వహించాలన్నారు. సచివాలయం సిబ్బంది డ్రస్ కోడ్‌తో పాటు బ్యాడ్జి పెట్టుకోవాలని ఆదేశించారు. సర్వీసుకు సంబంధించిన ఆర్‌టీసీ టికెట్ బుకింగ్, కరెంట్ బిల్లులు, రెవెన్యూ సంబంధించిన అర్జీలు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి షడ్‌లో వర్మీ కంపోస్టు ఎరువులు తయారి చేసి విక్రయించాలని కోరారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా పెరిగినందున ప్రతి పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. జగనన్న లేఅవుట్లలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని వివరించారు. నూరు శాతం ఇంటి పన్నులు వసువులు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. విస్తర్ణాధికారి ఏ.బాలచెన్నయ్య, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నరేంద్ర దేవ్, సీనియర్ అసిస్టెంట్ కె.సుదర్శన్, జూనియర్ అసిస్టెంట్ తేజ, పంచాయతీ కార్యదర్శులు, ఎంసీవోలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఒంగోలు: వికలాంగుల సమస్యలపై తక్షణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూల నిర్ణయాన్ని ప్రకటించాలని లేదంటే చలో అమరావతితోపాటు తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ధరలు పెరిగిన దృష్ట్యా రూ.3 వేల వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలు చేయాలన్నారు. రిజర్వేషన్ శాతాన్ని 7కు పెంచాలన్నారు. 32 డిమాండ్లకు సంబంధించి కార్యాచరణ ప్రకటిస్తామని మందా కృష్ణ మాదిగ హెచ్చరించారు.

అన్ని గ్రూపులకు వైఎస్సార్ ఆసరా


మాట్లాడుతున్న ఆళ్ళ రవీంద్రరెడ్డి

కొత్తపట్నం: అన్ని డ్వాక్రా గ్రూపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా నగదును వారి అకౌంట్‌లో జమ చేశామని కొంత మంది టీడీపీ ఆకతాయిలు వైఎస్సార్ నగదు పడలేదని చెడ్డ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ రవీంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. బ్యాంక్‌లో రద్దీ ఉండటంతో విడతల వారీగా నగదును బ్యాంక్‌లకు పంపిణీ చేస్తామన్నారు.

ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తాం

ఒంగోలు: నగరంలోని ఎస్సీ, ఎస్టీ, జర్నలిస్టు పిల్లలకు త్వరలో నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (రిజిస్టర్డు) కార్యదర్శి వసంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారి వివరాలను ఈనెల 31వ తేదీలోగా తమకు తెలియజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9440925092, 9182095153 నంబర్లను సంప్రదించాలన్నారు.

పరిశుద్ధమైన హృదయం కలిగి ఉండాలి


ప్రారంభ ప్రార్థన చేస్తున్న కుమారి బేబిస్టార్

ఒంగోలు రూరల్: ప్రతి ఒక్కరూ నీతి మార్గాన నడిచి పరిశుద్ధమైన హృదయం కలిగి ఉండాలని అప్పుడే నిజమైన క్రైస్తవుడవుతాడని పాస్టర్ విజయ కుమార్ అన్నారు. రూరల్ మండలంలోని బేతేల్ ప్రార్థన మందిర ఆవరణంలో ఏర్పాటు చేసిన సభల్లో దైవ వర్తమానాన్ని అందించారు. తొలి పలుకులను కుమారి జి.బేబిస్టార్ అందించగా, ప్రార్థన కార్యక్రమాలను స్థానిక పాస్టర్ సి.హెచ్.విక్టర్‌పాల్ నిర్వహించారు. రెవరెండ్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రార్థన మందిరాలకు అలవాటు చొప్పున రావడం మానుకుని హృదయ శుద్ధితో పూర్తి దైవ భక్తి కలిగి విరిగి నలిగిన మారుమనస్సు తో ప్రార్థనలో పాల్గొనాలన్నారు. దేవుడు చెప్పిన పది ఆజ్ఞలను తప్పకుండా పాటించాలని అప్పుడే హృదయ శుద్ధి కలుగుతుందని చెప్పారు. అది లేని మనస్సు దేవునికి అంగీకారం కాదని గుర్తుచేశారు.

పద్మావతి అమ్మవారికి ముత్యాల హారం


అమ్మవారికి ముత్యాల హారాన్ని కానుకగా అధికారులకు అందజేస్తున్న దాతలు

తిరుచానూరు (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి భక్తులు ముత్యాలహారాన్ని కానుకగా అందజేశారు. ఒంగోలుకు చెందిన వరప్రసాద్ దంపతులు మంగళవారం ఆలయానికి చేరుకుని హారాన్ని ఆలయ సూపరింటెండెంట్ శేషగిరికి అందజేశారు. సుమారు రూ.52వేల విలువైన ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించాలని దాతలు అధికారులను కోరారు. అనంతరం వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అర్చకుడు బాబు స్వామి, వీఐ రామ్మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న కౌన్సిలర్‌లు, పద్మశాలీయుల సంఘం నాయకులు

చీమకుర్తి: చేనేత కుటుంబానికి చెందిన వృద్ధ మహిళ అనుముల కోటేశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందటంతో మంగళవారం అంత్యక్రియల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, చేనేత సొసైటీ ప్రెసిడెంట్ సోమా యానాదిశెట్టి, అవ్వారు ఆదినారాయణ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. పద్మశాలీయుల సంఘం తరఫున వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

2000 నోటుకు బై..బై


2000 నోట్లను డిపాజిట్ చేసుకుంటున్న వ్యక్తి


ఎస్‌బీఐ బ్యాంక్‌లో 2000 నోట్లను డిపాజిట్ చేసుకుంటున్న ఖాతాదారులు

ఆర్‌బీఐ నిబంధనల మేరకు 2000 రూపాయల నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు మంగళవారం జనం బారులు తీరారు. చివరి సారిగా నోట్లను చూసుకున్నారు. – ఒంగోలు